క్లుప్తంగా

పక్కాగా భూముల రీసర్వే



సర్వే వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్

రేగిడి: మండలంలో అన్ని గ్రామాల్లో భూముల రీసర్వే పక్కాగా జరుగుతోందని తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి అన్నారు. మండలంలో కాగితాపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను శనివారం ఆయన పరిశీలించారు. రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. సర్వే జరుగుతున్న సమయంలో రైతులు స్థానికంగా ఉండాలని, తమకు ఎటువంటి అభ్యంతరాలు వచ్చినా వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా బ్లూ కలర్ డే



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో బ్లూ కలర్ డే వేడుకలు

తెర్లాం: మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె. రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు శనివారం బ్లూ కలర్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు బ్లూ కలర్ డ్రెస్‌లు వేసుకుని వచ్చారు. కార్యక్రమానికి హాజరైన తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్, ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి బ్లూ కలర్ డే విశిష్టతను వివరించారు. నీలిరంగుతో ఉన్న వస్తువులు, బొమ్మల పేర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యకర్త వై. శ్రీదేవి, హెల్పర్ లక్ష్మి, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ



చిన్నారులకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రేగిడి: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. అంబఖండి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వేస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో పాటు ఆయా గ్రామాల్లోని ఆశా వర్కర్లు ప్రజలకు చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. సకాలంలో వ్యాక్సిన్, టీకాలు చిన్నారులకు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎరువుల దుకాణాల పరిశీలన



ఎరువుల నమూనాలు సేకరిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: మండల కేంద్రంలోని ఎరువుల షాపులను ఏఓ కె. శిరీష సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించి.. ఎరువులు, విత్తనాల నమూనాలను సేకరించారు. సేకరించిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల నమూనాలను తిరుపతిలోని ఆర్‌సీసీ ల్యాబ్‌కు పంపనున్నట్లు చెప్పారు. ఎంఆర్‌పీకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని యజమానులకు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతో పాటు ఏఈఓ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన 'నాడు - నేడు' పనులు



ఎంఈఓ లక్ష్మణదొర

బాడంగి: నాడు – నేడు ఫేజ్ -2లో అర్ధంతరంగా నిలిచిపోయిన పనులతో పాటు ఫేజ్ -3లో మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ పి. లక్ష్మణదొర సంబంధిత హెచ్‌ఎంలను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంఆర్‌పీఎస్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, పూర్తయిన భవనాలకు రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. వచ్చే నెల 25న జరగనున్న ఇండియన్ నేవీ క్విజ్ పోటీలకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల పేర్లు నమోదుచేయాలన్నారు. అదేవిధంగా ఆగస్టు 31న జరగనున్న ఇన్‌స్పైర్ అవార్డులకు, సీబీఈ పరీలకు పిల్లలను సిద్ధం చేయాలని సూచించారు.

విద్యార్థినికి అభినందన

వంగర: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం మత్స సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివిన తూతిక దీపిక శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. కష్టంతో పాటు ఇష్టంతో చదవాలని, తల్లిదండ్రులు ఆశయాలను నెరవేర్చాలని సూచించారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రజలకు వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేస్తున్నారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు పొందని వారికి 'జగనన్న సురక్ష'తో ఎంతో మేలు జరుగుతుంది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో పలు సచివాలయాల పరిధిలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని అర్జీదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్ బొబ్బిలి/రాజాం



రామభద్రపురం: బూసాయవలసలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మడక తిరుపతినాయుడు, తదితరులు



మెంటాడ: లోతుగెడ్డ గ్రామంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ తదితరులు



సంతకవిటి: సంతకవిటిలో అర్జీదారుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.పద్మలత, ప్రజాప్రతినిధులు



బాడంగి: గజరాయునివలస సురక్ష శిబిరంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గౌరి, ప్రత్యేకాధికారి చంద్రరావు, తదితరులు



తెర్లాం: నందబలగలో లబ్ధిదారునికి కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



రాజాం సిటీ: లచ్చయ్యపేటలో విద్యార్థినికి ధ్రువపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కమిషనర్ డీటీవీ కృష్ణారావు



రాజాం: శ్యాంపురంలో ధ్రువపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడ, జెడ్పీటీసీ బండి నర్సింహులు, తదితరులు

అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మిర్తివలసలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: పార్టీలకు అతీతంగా.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని మిర్తివలస గ్రామంలో శనివారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో నవరత్న పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన మేలును వివరించారు. అర్హత ఉండి ఎవరికైనా పథకాలు అందనట్లయితే తెలియజేయాలని కోరారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడి ఎవరికీ ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇన్ని పథకాలు అమలు చేసినప్పటికీ ఏ ఒక్క పథకంలోను అవినీతి జరిగిన దాఖలాలు లేవని, ఇదే పారదర్శకతకు నిదర్శనమన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే చేరవేస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రతీ గడపలో మహిళలు హారతులు పట్టి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, సర్పంచ్ రాజాపు లక్ష్మి, ఎంపీటీసీ రాజాపు చిన్నమ్మడు, స్థానిక నాయకులు రాజాపు భూపతి, రాజాపు రమణ, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీడీఓ జీవీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లుల చెల్లింపు



నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు



రాజాం: పెనుబాకలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

వంగర: గృహనిర్మాణ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు జమచేస్తున్నామని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మగ్గూరులో నిర్మాణంలో ఉన్న గృహాలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వం అందించే రాయితీలను, ప్రోత్సాహకాలను సద్వినియోగంచేసుకుని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

రాజాం: హౌసింగ్ లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు కోరారు. మండలంలో పెనుబాక గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావుతో కలిసి ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రోత్సాహకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఎంత త్వరగా నిర్మాణాలు పూర్తిచేస్తే అంత త్వరగా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

సంతకవిటి: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన నెయ్యల రాజు(37) అనే మహిళ ఈ నెల 12న గుండెపోటుతో మరణించింది. ఆమె వైఎస్సార్‌బీమా లబ్ధిదారులు కావడంతో దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలును సర్పంచ్ డోల తిరుపతి మృతురాలి కుమారుడు నెయ్యల రాకేష్‌కు శనివారం అందజేవారు. మిగినల మొత్తాన్ని ప్రభుత్వం నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని వెల్ఫేర్ అసిస్టెంట్ పోలన్‌కుమార్ తెలిపారు.



మృతురాలి కుమారుడు రాకేష్‌కు నగదు అందజేస్తున్న సర్పంచ్ డోల తిరుపతి

ప్రతీ సంఘం ఎ-గ్రేడ్‌లో ఉండాలి

వంగర:

మహిళా స్వయం శక్తి సంఘాలు ఏ గ్రేడులో ఉండాలని ఏపీఎం మీసాల చక్రపాణి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి అధ్యక్షతన గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీఓఏలతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల నుంచి సీఐఎఫ్, బ్యాంకు లింకేజీలు, పీఓపీ, స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలు చెల్లింపు, సంఘాల పనితీరు, కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సహించడం, సంఘాల లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అన్ని గ్రామైక్య సంఘాల్లో ఉన్న మహిళా స్వయం శక్తి సంఘాల రికార్డులను ఆడిట్ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏపీఎం బి.గోవిందరావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం చక్రపాణి

రేపటి నుంచి చౌడీశ్వరీదేవి ఉత్సవాలు

రాజాం: పట్టణంలో మల్లికార్జునకాలనీలో కళ్యాణీగౌరీ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న చౌడీశ్వరీదేవి ఆలయ 28వ వార్షికోత్సవాన్ని సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17న వార్షికోత్సవ ప్రారంభం, విఘ్నేశ్వర పూజ, ఉత్సవ విగ్రహాల తిరువీధి, 18న దేవికి అభ్యంగ స్నానం, పంచామృతాభిషేకాలు, కుంకుమపూజలు ఉంటాయి. 19న కుంకుమపూజలు, సహస్రనామార్చన, అష్టోత్తర పూజా కార్యక్రమాలు, చౌడీశరీదేవి అనుప పండగ ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి: మండలంలో పనసలవలస గ్రామంలో పాడైన తాగునీటి బోర్లను శనివారం బాగుచేయించారు. పంచాయతీ నిధులతో మరమ్మతు పనులు చేయించినట్లు సర్పంచ్ గేదెల గోవిందరావు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ పనులు పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



ప్రకృతి వ్యవసాయం సాగును పరిశీలిస్తున్న డీపీఎం తదితరులు

బొబ్బిలి: ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యకరమైన, నాణ్యమైన దిగుబడులు సాధించగలమని డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని మెట్టవలసలో సాగు చేస్తున్న నవధాన్యాల పచ్చిరొట్ట ఎరువుల సాగును శనివారం ఆయన పరిశీలించారు. మెట్టవలస ఆర్‌బీకే పరిధిలో చేపట్టిన ఈ పచ్చిరొట్ట ఎరువులతో పంటలు ఎంతో నాణ్యమైనవిగా ఉంటాయని చెప్పారు. వీఏఏ రాజశేఖర్, సిబ్బంది వాండ్రాసి లక్ష్మి, వరప్రసాద్ తదితరులున్నారు.

అగ్నివీర్ మాక్ ట్రయల్ రన్



ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ చింత శారద తదితరులు

బొబ్బిలి: భారత సైన్యం ఎంపిక కోసం నిర్వహించే అగ్నివీర్ ఎంపికల కోసం వెళ్లనున్న విద్యార్థులు, యువతకు మాక్ ట్రయల్ పరుగు పందెం నిర్వహించారు. స్థానిక వీర బొబ్బిలి క్రీడా ప్రాంగణంలో స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 1600 మీటర్ల పరుగు పందెం శనివారం నిర్వహించారు. దీనిని అభ్యుదయ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింత శారద జెండా ఊపి ప్రారంభించారు. పరుగు పందెంలో మొదటి ఐదుగురికి రాజా రమేష్ చౌదరి బహుమతులు అందజేశారు. తిరుపతిరావు, ఎస్.నాగేంద్ర పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో బహుళ ప్రయోజనాలు

రాజాం సిటీ: విత్తన శుద్ధితో పంటలో అధిక లాభాలు పొందవచ్చని సీఆర్‌పీ నారాయణమ్మ అన్నారు. గార్రాజుచీపురుపల్లి గ్రామంలో శనివారం బీజామృతంతో సామూహికంగా విత్తన శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం ద్వారా మొలకశాతం పెరుగుతుందని, తెగుళ్ల ఉద్ధృతిని నివారించవచ్చని అన్నారు. అలాగే 30 రోజుల వరకు ఎటువంటి ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన పనిలేదన్నారు. ఆర్‌బీకేల్లో బీజామృతం అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పి.కృష్ణమోహన్, రైతులు పాల్గొన్నారు.

యాప్‌లో పిల్లల వివరాలు

తెర్లాం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమగ్ర వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని తెర్లాం హైస్కూల్‌లో పనిచేస్తున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్కూల్ అసిస్టెంట్ సునీల్‌కుమార్, మండల ఐఈఆర్‌టీ సూర్యారావు అన్నారు. మండలంలోని కుమ్మరిపేట ఎంపీపీ స్కూల్, కేజీబీవీ, లోచర్ల, రంగప్పవలస, తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులచే ప్రశస్త యాప్ డౌన్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ వారు రూపొందించిన ప్రశస్త యాప్‌లో ఉపాధ్యాయులంతా ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమగ్ర వివరాలను నమోదు చేయాలని కోరారు. యాప్‌లో నమోదు చేసిన పిల్లలకు వైద్య సదుపాయాలు, సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.



ప్రశస్త యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్, ఐఈఆర్‌టీ సూర్యారావు

సత్ప్రవర్తనతో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ దూరం

బొబ్బిలి: కళాశాల విద్యనభ్యస్తున్న విద్యార్థుల్లో సహ విద్యార్థుల పట్ల మంచి ప్రవర్తన కలిగినప్పుడే ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటివి దూరమవుతాయని బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో స్వామి వివేకానంద పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి వాసుదేవన్ మాట్లాడుతూ విద్యపైనే దృష్టి ఉంచాలని, మనం కళాశాలకు ఎందుకు వస్తున్నామన్న విషయాన్ని తెలుసుకుని ప్రవర్తనలో మార్పులు తెచ్చుకోవాలన్నారు. డ్రగ్స్ వినియోగం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎస్‌ఐ చదలవాడ సత్యనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి వాసుదేవన్

పొలాలకు దారి కల్పించాల్సిందే...

మెంటాడ: మిగులు పొలాలకు రహదారి సౌకర్యంతో పాటు, సాగునీరు వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేస్తేనే రింగ్‌రోడ్డు నిర్మాణానికి ముందుకు రావాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని శనివారం రింగ్‌రోడ్డు నిర్మాణం చేసేందుకు వచ్చిన సిబ్బందికి స్థానిక రైతులు తమ డిమాండ్లను తెలియజేశారు. గతంలో పరిహారం 30శాతం అదనంగా చెల్లిస్తామని, అలాగే ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, అలాగే విస్తీర్ణంలో ఉన్న తేడాలను సరి చేయాలని, అలాగే గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో లేని సర్వే నంబర్లకు ఫ్రీజింగ్ తొలగించాలని డిమాండ్ చేశారు. రైతుల డిమాండ్లను విన్న సంబంధిత అధికారులు పై అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గం చూపేందుకు ప్రయత్నించడం జరుగుతుందని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు. నిరసనలో స్థానిక రైతులు గంద్రేటి అప్పలనాయుడు, పాండ్రంకి సన్యాసిరావు, రేగిడి రాంబాబు, పతివాడ విశ్వేశ్వరరావు, నారయ్య, పాండ్రంకి రామునాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు.



హైవే సిబ్బందితో తమ డిమాండ్లను చెబుతున్న రైతులు

రూ.కోటితో నూతన భవనాల నిర్మాణం



నిర్మాణం పూర్తయిన గ్రామసచివాలయ భవనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్‌బీకే భవనం

రేగిడి: మండలంలో చాటాయివలస పంచాయతీలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించినట్లు సర్పంచ్ కరణం గోవిందరావు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పంచాయతీకి కోటి రూపాయలు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. వెల్‌నెస్ కేంద్రం నిర్మాణానికి రూ.20 లక్షలు, 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పంచాయతీకి భారీగా నిధులు మంజూరు కావడం పట్ల సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలు పూర్తయిన భవనాలను మరో నాలుగు రోజుల్లో ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

మురుగు సమస్య పరిష్కారం

రాజాం: మండలంలో గుయ్యానవలస గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మురుగు సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే కంబాల జోగులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మురుగు సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేయడంతో ఆ నిధుల నుంచి రూ.5 లక్షలతో గ్రామంలో మురుగు కాలువలు నిర్మించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కాలువలు నిర్మాణం చేపడతామని సర్పంచ్ సమతం రమేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తెలిపారు.



గ్రామంలో నిర్మించిన మురుగుకాలువ

చురుగ్గా యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

సంతకవిటి:

ఏపీయూటీఎఫ్ మండల శాఖ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. శనివారం బొద్దూరు, జీఎస్ పురం, మామిడిపల్లి, మండాకురిటి, సిరిపురం, మందరాడ, వాల్తేరు, హొంజరాంలోని ఉన్నత పాఠశాలలు, తాలాడ, గరికిపాడు, జావాం, కొండగూడేం, మిత్తారిపురంలలోని ప్రాథమికోన్నత పాఠశాలలు, శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, తమరాం, గోళ్లవలస బూరాడపేట, పోడలి తదితర గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వం నమోదు చేశారు. కార్యక్రమంలో ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహనరావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.కృష్ణారావు, కె.శ్రీనివాసరావు, శాసపు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వంపై అవగాహన కల్పిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మోహనరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని ఏఈ కుమార్ శనివారం తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలను మార్చుతున్నందున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులంతా సహకరించాలని కోరారు.